

# తల్లిలాంటి ఒడి!



పనిప్రదేశంలో చిన్నారిని ఊయలలో లాలిస్తున్న తల్లి



- పేద పిల్లల కోసం 'శిశు సదనం'
- మూడేళ్లలోపు చిన్నారుల కోసం చైల్డ్‌కేర్ సెంటర్లు
- అంగన్‌వాడీలకు అనుసంధానంగా ఏర్పాటు
- ములుగు జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల ఏర్పాటుకు సన్నాహం
- ఆరుచోట్లు ప్రారంభానికి సిద్ధం

ములుగు, సెప్టెంబరు 30: కడు పేదరిక జీవితాలు అవి. చెమట చిందిస్తేనే పూట గడుస్తుంది. కూలికి పోతేనే కూడు.. లేదంటే పస్తులే. పొద్దు పొడవక ముందే మొదలై సాయంసంధ్య వరకూ రెక్కలు ముక్కలు చేసుకోవాల్సిందే. పల్లెల్లో జీవన చిత్రంలో నిత్యం కనిపించే దృశ్యాలివి. చంటి బిడ్డలను చంక దింపదింపలేక.. గుడిసెలో ఒంటరిగా వదిలి వెళ్లలేక అనేకమంది పేద తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. పొలం గట్టుపైనో, చెట్టుకు చీరతో ఊయల కట్టో వారిని నిద్రపుచ్చి పనులు చేసుకునేవారు ఎంతమందో! వృద్ధులైన తల్లిదండ్రులుంటే బాలల ఆలనా పాలనా వారు చేసుకుంటారు. అదే పెద్దదిక్కు. లేకుంటే ఆ పేద తల్లిదండ్రులకు గోసే. ఇలాంటి పరిస్థితి నుంచి ఊరట కలిగించేందుకు ప్రభుత్వం శిశు సదనాలను ఏర్పాటు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే ఈ చైల్డ్‌కేర్ సెంటర్లకు క్రష్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ సాంకేతిక సహకారం అందిస్తోంది. ఏడు నెలల వయసు నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు ఇక్కడ అమ్మ ఒడిలాంటి ప్రేమనుపంచుతూ సంరక్షించేందుకు అడుగులు పడుతున్నాయి.

**ములుగు జిల్లాలో 30 కేంద్రాలు**

కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం వాటాతో ఈ శిశు సదనాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడున్న అంగన్‌వాడీ కేంద్రాలకు అనుబంధంగా వీటిని నెలకొల్పనున్నారు. తెలంగాణ రాష్ట్రానికి వెయ్యి కేంద్రాలు మంజూరు కాగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ములుగు జిల్లాకు 30 కేటాయించారు. వ్యవసాయ, దినసరి కూలీలు, మూడేళ్లలోపు చిన్నారులు ఎక్కువ మంది ఉన్న కేంద్రాలను గుర్తించి వాటికి ప్రాధాన్యమివ్వనున్నారు. ప్రయోగాత్మకంగా తొలి విడతలో ఆరు చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ములుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని దేవనగర్, మల్లంపల్లి-3, ఏటూరునాగారం ప్రాజెక్టు పరిధిలోని రోహీర్-1, వెంకటాపురం(నూగూరు) పరిధిలోని రామచంద్రాపురం, ముత్తారం, ఏటూరునాగారం ప్రాజెక్టు పరిధిలో మంగపేటలోని కూరాకుల వీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ శిశు సదనాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ అక్కేశ్వర్‌రావు బృందం శనివారం ములుగు మండలంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సానుకూలతను పరిశీలించింది. తొలుత ఈ ఆరు కేంద్రాలను ప్రారంభించనున్నారు. నిర్వహణలో లోటుపాట్లను సర్దుబాటు చేసుకొని నవంబరు 14 వరకు మిగతా 24 కేంద్రాలను సిద్ధం చేయనున్నారు. కాగా, రెండు మొబైల్ శిశు సదనాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ దివాకర ప్రతిపాదించారు. ఉపాధిహామీ పనులు, కూలీ పనులు జరిగే ప్రదేశంలో వాహనాలను ఏర్పాటుచేసి చంటిపిల్లలను సంరక్షించనున్నారు. దీనికి అనుగుణంగా మోడల్ వాహనాలను రూపొందించేందుకు ఆలోచన చేస్తున్నారు.



ములుగు మండలంలో శిశు సదనం ఏర్పాటును పరిశీలిస్తున్న స్త్రీశిశు సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారుల బృందం

**ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు..**

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఉంటారు. ఉదయమే పనిలోకి వెళ్లి సాయంత్రానికి గానీ తిరిగి రారు. అందుకే ఈ శిశు సదనాలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా ఓ టీచర్, ఆయాలను నియమిస్తారు. పిల్లలను నిద్రపుచ్చడానికి ఉయ్యాలలు, ఆడుకోవడానికి బొమ్మలు, ఆట వస్తువులు, వాకర్లు, ఇతర ఏర్పాట్లు ఉంటాయి. గుడ్డు, బాలామృతం పాలు, పండ్లు ఇవ్వనున్నారు. ఆరోగ్యానికి సంబంధించి హెల్త్ కిట్లను కూడా సమకూర్చుతున్నారు. ఒక్కో చిన్నారికి రోజుకు రూ.8 చొప్పున ఖర్చుచేయనున్నారు.

**జిల్లాలో 9,824 మంది చిన్నారులు**

జిల్లావ్యాప్తంగా నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 640 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 9,824 మంది ఉన్నారు. అయితే 294 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా 149 అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. మరో 197 ప్రభుత్వ పాఠశాలల్లోని గదుల్లో నిర్వహిస్తున్నారు. శిశు సదనాలకు ప్రత్యేకంగా ఓ గది, మూత్రశాల, మరుగుదొడ్డి తదితర సౌకర్యాలున్న నిర్మాణాలు అవసరమున్నాయి. వీటిని గుర్తించేందుకు ఐసీడీఎస్ అధికారులు గ్రామాల్లో పరిశీలన చేపట్టారు.

**తల్లిదండ్రులకు మంచి అవకాశం : కె.శిరీష, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో**

మూడేళ్లలోపు చిన్నారులున్న నిరుపేద తల్లిదండ్రులకు శిశు సదనాలు ఎంతగానో ఉపయుక్తం కానున్నాయి. పాలు తాగే చంటిబిడ్డలను ఈ శిశు సదనాల్లో చేర్చుకొని సంరక్షించనున్నాం. వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని ఇస్తూనే తల్లి ప్రేమను పంచుతాం. ఈ శిశు సదనాలను గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ కేంద్రాల నిర్వహణ కోసం కొత్తగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను నియమించుకుంటాం. దీంతో మరింత మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి లభిస్తుంది.

## దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

**3 నుంచి ప్రారంభం.. కాళేశ్వరంలో ముమ్మరంగా ఏర్పాట్లు**

మహదేవపూర్, సెప్టెంబరు 30 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర పుణ్యక్షేత్రం ముస్తాబవుతోంది. ఆలయం అనుబంధ దేవాలయమైన శ్రీ శుభానందాదేవి ఆలయంలో 3వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తొమ్మిదిరోజుల పాటు తొమ్మిది రూపాల్లో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనమిస్తారు. సరస్వతీదేవిని సైతం తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో అలంకరించనున్నారు.

**కార్యక్రమాలు ఇలా...**

3వ తేదీ శ్రీ శుభానందాదేవి, సరస్వతి అమ్మవార్లను శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 6 గంటల నుంచే పూజా క్రతువులు ప్రారంభమవుతాయి. అమ్మవార్లకు పూర్ణాభిషేకం, అలంకరణ తదితర కార్యక్రమాలు ఉంటాయి. ఉదయం 10.15 గంటలకు గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం తదితర పూజలు నిర్వహించనున్నారు. 4న బ్రహ్మచారిణి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 5న చంద్ర ఘంట అలంకారంలో పూజలు అందుకోనున్నారు. 6న కూష్మాండ అలంకారంలో దర్శనమివ్వనున్నారు. 7న స్కంధమాత అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. 8న కాత్యాయని అలంకారంలో పూజలందుకోనున్నారు. 9న కాళారాత్రి అలంకారంలో అమ్మవారు పూజలు అందుకోనున్నారు. 10న మహాగౌరి అలంకారంలో అమ్మవారు పూజలందుకోనున్నారు. 11న సిద్ధిదా అలంకారంలో పూజలందుకోనున్నారు. 12న సువర్ణ కిరీట రజత కవచాలంకృత శుభానందాదేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారు. ఆ రోజు విజయదశమి, శమి పూజ, సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

## లాభాల బాటలో ఆర్టీసీ

**వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం విజయభాను

కాకతీయఖని, సెప్టెంబరు 30: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొమ్మిది డిపోల పరిధిలో ఆర్టీసీ సంస్థ లాభాల బాటలో పయనిస్తోందని రీజినల్ మేనేజర్ విజయభాను తెలిపారు. ప్రస్తుతం రూ. 49.66 కోట్ల లాభాల్లో ఉన్నామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకమే అందుకు కారణమని అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా భూపాలపల్లి ఆర్టీసీ డిపోను ఆయన సోమవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి, డిపో ఉద్యోగులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వరంగల్ రీజియన్‌లోని ఉత్తమ డిపోల్లో భూపాలపల్లి ఒకటని అన్నారు. ఆగస్టు వరకు డిపో రూ. 5.71 కోట్ల లాభాల్లో ఉందని తెలిపారు. 15 డిసెంబరు 2023 నుంచి 29 సెప్టెంబరు 2024 వరకు మహాలక్ష్మి పథకంలో భాగంగా 7.38 కోట్ల మహిళా ప్రయాణికులు వరంగల్ రీజియన్ పరిధిలో ప్రయాణించారని తెలిపారు. వీరి ద్వారా సంస్థకు రూ. 328.28 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. ఒక్క భూపాలపల్లి డిపో పరిధిలోనే 66.48 లక్షల మహిళా ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసులను వినియోగించుకున్నారని వివరించారు. వీరి ద్వారా డిపోకు రూ. 34.49 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) భానుకిరణ్, డిపో ఇన్‌చార్జ్ డీఎం రవిచంద్, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి పాల్గొన్నారు.

## నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 30: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుందని డీఈవో రాజేందర్ తెలిపారు. డీఎస్సీ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సెమ్మెస్ లేదా ఈ-మెయిల్ రూపంలో సమాచారం అందుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా భూపాలపల్లిలోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు పరిశీలన ప్రారంభమవుతుందని, అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు గెజిటెడ్ సంతకంతో ఉన్న జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో మాజీ వైస్ ఎంపీపీ మృతి

**భర్త మరణించిన ఏడాదిలోనే భార్య మృతి**





ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు, పుష్పలత (ఫైల్)

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 30: రోడ్డు ప్రమాదంలో భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ తాజా మాజీ వైస్ ఎంపీపీ బండం పుష్పలత (50) దుర్మరణం పాలయ్యారు. హైదారాబాద్ శివారు ఔటర్‌రింగ్‌రోడ్డు శామీర్‌పేట వద్ద ఈ ప్రమాదం సోమవారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పుష్పలత భర్త లక్ష్మారెడ్డి గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారం రోజుల క్రితం ఆయన సంవత్సరీకం జరగ్గా అమెరికాలో ఉన్న కుమారుడు మనోహర్ ఆ కార్యక్రమానికి హాజరయ్యాడు. తిరిగి ఆయన సోమవారం అమెరికాకు పయనమయ్యాడు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు కొడుకుతోపాటు కూతురు, అల్లుడు, మనువరాలితో కలిసి పుష్పలత కారులో బయల్దేరారు. కొడుకు మనోహర్ డ్రైవ్ చేస్తుండగా ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో పుష్పలత అక్కడికక్కడే మృతి చెందారు. కూతురు రష్మిక, మనువరాలు రియాన్షికి గాయాలయ్యాయి. కొడుకు మనోహర్‌తోపాటు అల్లుడు స్వల్పంగా గాయపడ్డారు.

సంవత్సరం వ్యవధిలోనే భార్యాభర్తలిద్దరు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందడంతో ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. బొమ్మాపూర్ గ్రామానికి చెందిన పుష్పలత రెండు దఫాలుగా ఎంపీటీసీగా గెలుపొంది వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె భర్త బండం లక్ష్మారెడ్డి రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడిగా కొనసాగుతుండగా గత ఏడాది భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దంపతులు ఇద్దరికీ రాజకీయంగా మండలంలో మంచి పేరుంది. లక్ష్మారెడ్డి మృతి చెందిన ఏడాదిలోనే భార్య పుష్పలత కూడా ప్రాణాలు కోల్పోవడం బొమ్మాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## వినతులపై సత్వరమే స్పందించాలి

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ**



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 30: ప్రజల నుంచి వచ్చే వినతులపై సత్వరంగా స్పందించాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని మండల పరిధిలో పరిష్కరం అయ్యే సమస్యలను తహసీల్దార్ కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు ప్రతి శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. ప్రజావాణిలో 57 వినతులు వచ్చాయి. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

**కుక్కలను నియంత్రించాలి**

కుక్కల వృద్ధి నియంత్రణకు శస్త్ర చికిత్స కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కుక్కల వృద్ధి నియంత్రణకు శస్త్ర చికిత్సల కేంద్రం ఏర్పాటుపై మునిసిపాలిటీ, పశుసంవర్ధక శాఖల అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. వీధి కుక్కల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటి వృద్ధి నియంత్రణకు శస్త్ర చికిత్స చేసే కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ అధికారి కుమారస్వామి, మునిపల్ కమిషనర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కులకు భంగం

- గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ వైఖరి
- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వైపతి అరుణ్‌కుమార్
- ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీలు

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 30: ఐదో షెడ్యూల్డ్‌లోని చట్టాల ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతోందని, ఆదివాసీల హక్కులకు భంగం కలుగుతోందని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వైపతి అరుణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏవిధంగానైతే చట్టాలు, హక్కులు ఉల్లంఘనకు గురయ్యాయో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా అదే కొనసాగుతోందని విమర్శించారు. ఆదివాసీ విద్యార్థి సంఘాలు ఏఎస్‌యూ, ఏఎంఎస్, ఏటీఎఫ్, ఏఎన్ఎస్ తోపాటు ఆదివాసీ ఉద్యోగ సంఘాలు, తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఐటీడీఏ వద్ద సోమవారం ధర్నా జరిగింది. ముందుగా మండల కేంద్రంలోని వైజంక్షన్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. వైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఆదివాసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. కనీసం విద్యార్థులకు ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు కూడా జారీ కావడం లేదన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో టీఎస్‌పీఎస్సీ ద్వారా జనరల్ నోటిఫికేషన్లు ఇవ్వడం ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వంద ఉద్యోగాలు రావాల్సి ఉండగా ఆరు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. జోనల్ పద్ధతి తప్పుల తడకగా ఉందని ఆనాడే చెప్పామని గుర్తు చేశారు. ఆదివాసీ బిడ్డ అయిన మంత్రి సీతక్క ఇప్పటికైనా స్పందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలయ్యేలా చూడా లని, 29 శాఖల జీవోల చట్టం చేసేలా కృషి చేయాలని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత ఉద్యోగాలు లేక చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పది మంది ఎమ్మెల్యేలతో ట్రైబల్ ఎడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేసి ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల ఆదివా సులపై దాడులు పెరిగాయని, అగ్రకులాల ఆధిపత్య ధోరణి పెరుగుతోందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే అధికారులు ఆదివాసీలకు అండగా ఉండాలని కోరారు.



ఐటీడీఏ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించిన ఆదివాసీలు

**పోలీసుల వలయంలో ఐటీడీఏ**

ఆదివాసీ విద్యార్థి సంఘాలు, తుడుందెబ్బ ఐటీడీఏ ముట్టడి నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సోమవారం ఐటీడీఏ ఎదుట భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో ఆదివాసులు తరలివస్తారని నిఘా వర్గాల సమాచారంతో ములుగు ఓఎస్డీ మహేష్ బాబాసాహెబ్ గితే ఆధ్వర్యంలోని పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఏటూరునాగారం, వెంకటాపురం సీఐలు అనుముల శ్రీనివాస్, కుమార్‌తో పాటు ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం మండలాలకు చెందిన నలుగురు ఎస్సైలు, ఇద్దరు ట్రైనీ ఎస్సైలతో బందోబస్తును చేపట్టారు. ఐటీడీఏ వద్ద ఆంక్షలు విధించి రాకపోకలు సాగించే వారి వివరాలను తెలుసుకొని లోపలికి పంపారు.

# పేదరికాన్ని జయించి.. లక్ష్యాన్ని చేరుకొని..

- డీఎస్సీలో మెరిసిన పేద బిడ్డలు
- అబ్బాపురం వాసికి జిల్లా మొదటి ర్యాంకు
- తాడ్వాయి యువకుడికి 13వ ర్యాంకు



మోటపోతుల అరుణ్
జిల్లా స్థాయి మొదటి ర్యాంక్



వావిలాల దుర్గాప్రసాద్
జిల్లా స్థాయి 13వ ర్యాంకు

ములుగు, సెప్టెంబరు 30: డీఎస్సీ-2024లో ములుగు జిల్లాకు చెందిన పలువురు పేదలు ప్రతిభ చాటారు. ఆటుపోట్లను ఎదుర్కొని పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకున్నారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో ములుగు మండలం అబ్బాపురం గ్రామానికి చెందిన మోటపోతుల అరుణ్ జిల్లాస్థాయి మొదటి ర్యాంకు సాధించాడు. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన వావిలాల దుర్గాప్రసాద్ 13వ ర్యాంకుతో సత్తా చాటాడు.


**తండ్రి మరణాన్ని దిగమింగుతూ..**

అబ్బాపురం గ్రామానికి చెందిన మోటపోతుల రాణి, ఆనందం దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు కాగా అరుణ్ చిన్నవాడు. కల్లుగీత కార్మికుడైన ఆనందం కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. బాల్యం నుంచి చదువులో ముందుండే అరుణ్ పదో తరగతిలో 547మార్కులు సాధించాడు. హనుమకొండలో ఇంటర్ పూర్తిచేశాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావాలనే తన తండ్రి ఆశయం కోసం అరుణ్ ఇంటర్ పూర్తికాగానే డీఈడీ చేశారు. ఆతర్వాత ఓపెన్‌లో డిగ్రీ పూర్తిచేశాడు. 2018డీఎస్సీలో ఓపెన్ కేటగిరీలో పోటీపడినప్పటికీ ఒకటిన్నర మార్కులతో క్వాలిఫై కాలేకపోయాడు. ఓ ప్రైవేటు బ్యాంకులో ఫైనాన్స్ డిపార్ట్‌మెంటులో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలబడ్డాడు. అయినా తన ప్రయత్నాన్ని మాత్రం మానుకోలేదు. తాజా ఫలితాల్లో ఏకంగా జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. అయితే కొడుకు విజయాన్ని కళ్లారా చూడకుండానే ఆనందం మరణించారు. ఈఏడాది జూన్‌లో ఆయన గుండెపోటుతో కన్నుమూశారు. తన తండ్రి దశదిన కర్మ జరిగిన మరుసటి రోజే జరిగిన పరీక్షకు హాజరైన అరుణ్ బాధను దిగమింగుతూనే లక్ష్యాన్ని చేరుకున్నాడు. తనను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా చూడాలనే తండ్రి ఆశయాన్ని నెరవేర్చినందుకు గర్వంగా ఉందని అరుణ్ చెప్పాడు.


**పేదరికమే తనకు తొలి గురువు..**

తాడ్వాయి మండలకేంద్రానికి చెందిన వావిలాల సమ్మక్క, సమ్మయ్య దంపతులకు ముగ్గురు కుమారులు కాగా దుర్గాప్రసాద్ చిన్నవాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో హైస్కూల్, ఇంటర్ విద్యను స్థానిక ప్రభుత్వ విద్యాసంస్థలలోనే పూర్తిచేశాడు. తల్లిదండ్రులిద్దరూ కూలికి వెళ్తే గానీ ఇల్లుగడవని పరిస్థితి. ఇది కళ్లారా చూసిన దుర్గాప్రసాద్ పేదరికం ఇచ్చి అనుభవాన్ని తొలిపాఠంగా భావించాడు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని సంకల్పించుకున్నాడు. టెన్త్‌లో స్కూల్ టాపర్‌గా నిలిచి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినప్పటికీ ఆర్థికస్తోమత లేక వెళ్లలేకపోయాడు. హనుమకొండ డైట్ కళాశాలలో డీఈడీ పూర్తిచేసిన ఆయన 2018 డీఎస్సీకి పోటీపడ్డాడు. 103వ ర్యాంకు రావడంతో ఉద్యోగానికి ఎంపిక కాలేదు. పట్టువదలకుండా చదివిన దుర్గాప్రసాద్ ఇప్పుడు 13వ ర్యాంకు పొందాడు. పేదరికాన్ని చూసి కుంగిపోవద్దని, సవాల్‌గా తీసుకుంటే ఖచ్చితంగా విజయం సాధించవచ్చని ఆయన అన్నారు.

## చిట్యాల మండల యువకుల ప్రతిభ



పీఈటీ జిల్లా టాపర్ పాలకుర్తి నవీన్



ఎస్‌జీటీ జిల్లా నాలుగో ర్యాంకర్ సురేందర్

చిట్యాల, సెప్టెంబరు 30: టీజీ డీఎస్సీ ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఉత్తమ ఫలితాలు సాధించారు. చల్లగరిగ గ్రామానికి చెందిన పాలకుర్తి నవీన్ పీఈటీ విభాగంలో 67 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచారు. కైలాపూర్ గ్రామానికి చెందిన పాశిగంటి సురేందర్ ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) విభాగంలో 62.40 మార్కులతో జిల్లా నాలుగో ర్యాంక్ సాధించాడు.

జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడైన నవీన్ ప్రస్తుతం హైదరాబాద్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. సురేందర్ మొగుళ్లపల్లి ఎమ్మార్సీలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఐఈఆర్పీగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

## స్వచ్ఛతా దివస్ వేడుకలకు రహీమొద్దీన్

**ములుగు ఎంపీవోకు అరుదైన అవకాశం**



ములుగు, సెప్టెంబరు 30: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 2న దేశ రాజధాని ఢిల్లీలో జరిగే స్వచ్ఛతా దివస్ వేడుకలకు ములుగు మండల పంచాయతీ అధికారి రహీమొద్దీన్ ఎంపికయ్యారు. సెప్టెంబరు 17 నుంచి స్వచ్ఛత సేవా పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. పారిశుధ్య పరిరక్షణలో విశిష్ట సేవలందించినందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క రహీమొద్దీన్‌ను ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం తొమ్మిది మంది ఎంపిక కాగా వీరిలో రహీమొద్దీన్ ఒకరు. అక్కడి విజ్ఞాన్ భవన్‌లో జరిగే పక్షోత్సవాల ముగింపు కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొం టున్నారు. అరుదైన అవకాశాన్ని పొందిన ఎంపీవో రహీ మొద్దీన్‌ను జిల్లా అధికారులు అభినందించారు.

## 'తిరుపతి లడ్డూ కల్తీపై చర్యలు తీసుకోవాలి'

టేకుమట్ల, సెప్టెంబరు 30: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ కల్తీలో కారకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ లడ్డూ వివాదంపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరపించాలని, దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని అన్నారు. దేవాలయాలలో తిష్టవేసిన అన్యమత ఉద్యోగులను వెంటనే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేరేళ్ల రామకృష్ణా, దేవేంద్రాచారి, దాసరి కుమారస్వామి, గాజుల అజయ్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ దసరా ఏర్పాట్లపై సమావేశం

వేలేరు ,సెప్టెంబర్ 30: బతుకమ్మ, దసరా ఏర్పాట్లపై వేలేరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన రెవెన్యూ ,ఆరోగ్య శాఖ ,పోలీసు శాఖల అధికారులు, స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. రాబోయే బతుకమ్మ , దసరా ఏర్పాట్లలో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా మెరుగైన సౌకర్యాలను అందించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాలలో పారిశుధ్యం, వీధి దీపాలు ,శాని టేషన్ వంటి ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. పనులు పూర్తి అయ్యే వరకు గ్రామాలలోజీపీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.


నయీంనగర్ బ్రిడ్జి సందర్శనలో వినయ్‌భాస్కర్, సుందర్‌రాజ్ తదితర బీఆర్ఎస్ నాయకులు


బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# నయీంనగర్ బ్రిడ్జి వద్ద రణరంగం

- నిర్మాణ ఘనత తమదేనన్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్
- ఖండించేందుకు కాంగ్రెస్ నేతల ప్రయత్నం
- ఇరు పార్టీల శ్రేణుల పరస్పర నినాదాలు, తోపులాట
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు శ్రమించిన పోలీసులు
- వాహనాల్లో వినయ్‌భాస్కర్, ఇతర నేతల తరలింపు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 30 : హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ ఘనతపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రకటనలు ఉద్రిక్తతకు దారి తీశాయి. నిన్నటి వరకు మీడియా, ఇతర మార్గాల్లోనే జరిగిన మాటల యుద్ధం.. సోమవారం ఏకంగా ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తల ప్రత్యక్ష యుద్ధానికి దారితీసింది. దీంతో నయీంనగర్ బ్రిడ్జి ప్రాంతం రణరంగంగా మారింది. పరిస్థితి చేయి దాటుతున్న క్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. వినయ్‌భాస్కర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు బ్రిడ్జిని పరిశీలించి రోడ్డుపై బైఠాయించారు. ఆ సమయంలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేయగా పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు వారిని చెదరగొట్టి.. వినయ్‌భాస్కర్ ఇతర బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని వాహనాల్లో తరలించారు. మొత్తంగా సుమారు రెండు గంటల పాటు నయీంనగర్ బ్రిడ్జి వద్ద హై టెన్షన్ వాతావరణం కనిపించింది.

**జరిగిందేంటంటే..**

నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణమే కాదు బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం, భద్రకాళి మాడ వీధులతో పాటు ఇతర అభివృద్ధి పనులను తొమ్మిది నెలల వ్యవధిలోనే చేపట్టామంటూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటిస్తూ వచ్చారు. దీనిపై పలు మార్లు స్పందించిన మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఆ ఘనత తమదేనని, తమ హయంలోనే నిర్మాణాలు చేపట్టామంటూ ప్రతి వాదన చేస్తూ వచ్చారు. 'మిత్ర' సంబోధం చేస్తూనే ఇద్దరూ తమ రాజకీయ వైరాన్ని బహిర్గతం చేస్తుండటం నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలోనే నయీంనగర్ మాత్రమే కాదు పలు అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు రావాలని నాయిని సవాల్ విసిరారు. అంతేకాదు హనుమకొండలో తాము చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ తమ ఘనతగా చెప్పుకొంటుందంటూ మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొంటున్నారన్న ఎమ్మెల్యే నాయినిని కేటీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సెప్టెంబరు 29న బ్రిడ్జి వద్ద చర్చకు రావాలని కేటీఆర్, వినయ్‌భాస్కర్‌కు ఆయన సవాల్ కూడా విసిరారు. తన సవాల్ మేరకు రాజేందర్‌రెడ్డి ఆదివారం బ్రిడ్జి వద్దకు వచ్చి మీడియాతో మాట్లాడారు. నయీంనగర్ బ్రిడ్జి కూల్చివేత, నిర్మాణం వరకు జరిగిన ప్రక్రియ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి నిధుల మంజూరు, నిర్మాణ పూర్తి వరకు వివరిస్తూ బీఆర్ఎస్ నేతల తీరును ఖండించారు.

ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 11గంటలకు నయీంనగర్ బ్రిడ్జి సందర్శనకు మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు వచ్చారు. అప్పటికే నయీంనగర్ బ్రిడ్జి వద్ద మీడియా సమావేశం ఉంటుందని కాంగ్రెస్ ప్రకటించగా మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు తోట వెంకన్న, రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతో పాటు అజీజ్‌ఖాన్, రజాలీ, అబూబాకర్ తదితరులు బ్రిడ్జికి కొద్ది దూరంలో నిలిచారు. బీఆర్ఎస్ సందర్శన తరువాత మీడియాతో మాట్లాడేందేకు వారంతా సిద్ధమయ్యారు. కానీ అప్పటికే పరిస్థితి వేడెక్కింది.

**ఉద్రిక్తతు దారి తీసిన వైనం**

మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మీడియాతో మాట్లాడిన తరువాత బ్రిడ్జి వద్దకు వచ్చేందుకు మేయర్ గుండు సుధారాణి ఇతర కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేశారు. ఆ సమయంలోనే కార్యకర్తలు తోపులాటకు దిగడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. వారు ఘర్షణ పడడంతో బ్రిడ్జి రణరంగానికి వేదికగా మారింది. అప్పటికే అక్కడ మోహరించిన అప్రమత్తమై ఇరువర్గాలకు నచ్చజెప్పినా ఫలితం లేకపోవడంతో వారు చెల్లా చెదురు చేశారు. కానీ పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు శ్రమించాల్సి వచ్చింది. రోడ్డుపై బైఠాయించిన వినయ్‌భాస్కర్ ఇతర నాయకులను పోలీసులు వాహనాల్లో బీఆర్ఎస్ కార్యాలయానికి తరలించారు. ఇక ఆ పక్కనే ప్రజాభవన్ ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే నయీంనగర్ బ్రిడ్జి విషయంలో బీఆర్ఎస్ హయాంలో నాడు ఆ పార్టీలో ఉన్న నాయకులే.. నాటి ప్రతిపక్ష, నేటి అధికార కాంగ్రెస్ వైపు మాట్లాడటాన్ని చూసిన స్థానికులు ఇదేనేమో రాజకీయ సిత్రం అంటే అని చర్చించుకోవడం కనిపించింది.

## ఆనాడే నగరాభివృద్ధి ప్రణాళికలు : మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్



నయీంనగర్ బ్రిడ్జిని సందర్శించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఇతర బీఆర్ఎస్ నాయకులు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయంలోనే నగరాభివృద్ధి కోసం రూ.500 కోట్ల ప్రణాళికలు సిద్ధమయ్యాయని వినయ్‌భాస్కర్ వెల్లడించారు. నయీంనగర్ బ్రిడ్జి, నాలా విస్తరణతో పాటు మరికొన్ని అభివృద్ధి ప్రణాళికులు సిద్ధం చేసినట్లు తెలిపారు. నిధుల మంజూరు, అవసరత ప్రాధాన్యత క్రమంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధమైనట్లు వివరించారు. గొప్పలు చెప్పుకోవడం తమకు ఇష్టం లేదని, కేయూ వంద ఫీట్ల రోడ్డు నిర్మాణం, ఆపై నయీంనగర్ బ్రిడ్జి చేపట్టేందుకు సిద్ధమైన క్రమంలో ఎన్నికలు వచ్చాయని వివరించారు. నాడు మంజూరైన నిధులతోనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఆ ఘనతను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తమదిగా చెప్పుకొంటున్నారని, రాష్ట్రం కోసం పోరాడిన చరిత్ర తమదని, ఎమ్మెల్యే నాయిని తమ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

## బీఆర్ఎస్‌ది రాజకీయ రాద్ధాంతం : మేయర్ గుండు సుధారాణి



అసత్యప్రచారాలతో బీఆర్ఎస్ రాజకీయ రాద్ధాంతం చేస్తోందని మేయర్ గుండు సుధారాణి విమర్శించారు. నయీంనగర్ బ్రిడ్జి వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. గతంలో వరదల సమయంలో నగరం ముంపునకు గురైందని, బీఆర్ఎస్ హయంలో బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనలు మాత్రమే జరిగాయని, నిర్మాణం చేపట్టలేదన్నారు. నిధుల కేటాయింపు కూడా లేదని ఈ విషయాన్ని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బాహాటంగానే చెబుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాజేందర్‌రెడ్డి నయీంనగర్ బ్రిడ్జితో పాటు కాళోజీ కళాక్షేత్రం ఇతర అనేక అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయించుకున్నారన్నారు. నయీంనగర్ పాత బ్రిడ్జి కూల్చివేసి నాలుగు నెలల్లోనే నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశారని తెలిపారు. నిధులు తీసుకొస్తేనే కదా బ్రిడ్జి నిర్మాణమే కాకుండా ఇతర అభివృద్ధి పనులు పూర్తి అవుతున్నాయంటూ వివరించారు. దీనిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని, తమ హయంలోనే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టామంటూ వినయ్‌భాస్కర్ చెప్పడం అసత్య ప్రచారమని కొట్టి పారేశారు.

# ఎంపీడీవో కార్యాలయం ఐనవోలుకు మార్పు

- ఆదేశాలు జారీచేసిన కలెక్టర్


ఎంపీడీవో కార్యాలయం మార్పుపై కలెక్టర్, ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు, సెప్టెంబరు 30: ఐనవోలు ఎంపీడీవో కార్యాలయాన్ని తక్షణమే హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి ఐనవోలు మండలకేంద్రానికి మార్చాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు జారీచేశారు. ఏడేళ్ల కిందట ఏర్పడిన ఐనవోలు మండల కేంద్రంలో నేటికీ ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేదు. జిల్లా కేంద్రంలోని వడ్డెపల్లిలో ఐనవోలు ఎంపీడీవో కార్యాలయం కొనసాగుతోంది. ఈ కార్యాలయాన్ని ఐనవోలుకు మార్చాలని గతంలో ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. సోమవారం ఐనవోలు కేజీబీవీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయం సమస్యపై ఆంధ్రజ్యోతి కథనాలను టెస్కాబ్ చైర్మన్ దృష్టికి పలువురు తీసుకెళ్లగా ఆయన నేరుగా కలెక్టర్, ఎమ్మెల్యే వద్దకు వెళ్లి ఎంపీడీవో కార్యాలయాన్ని హనుమకొండ నుంచి ఐనవోలుకు మార్చడానికి జరుగున్న జాప్యంను వివరించారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లును పిలిచి కార్యాలయంను తక్షణమే ఐనవోలుకు మార్చాలని అందుకు కావాల్సిన ఆదేశాలను జరీచేస్తానన్నారు. సాయంత్రం కలెక్టరేట్‌కు రావాలని కలెక్టర్ ఎంపీడీవోకు స్పష్టం చేశారు. దీంతో ఎంపీడీవో కార్యాలయాన్ని హనుమకొండ నుంచి ఐనవోలుకు మార్చడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎంపీడీవో కలెక్టర్‌కు లేఖపెట్టడం వెంట వెంటనే జరిగిపోయింది. ఒకటి రెండు రోజుల్లో హనుమకొండలోని కార్యాలయాన్ని ఖాళీ చేసి ఐనవోలులో ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఖాళీగా ఉన్న హాస్టల్ భవనం లేదా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో రఘుపతి తెలిపారు.

# రామన్నగూడెం యువకులది సహజ మరణమే

**నిర్ధారించిన వరంగల్ ఫోరెన్సిక్ ల్యాబ్**

నర్సింహులపేట, సెప్టెంబరు 30: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో ఒకేరోజు ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మిస్టరీ వీడింది. ఆ యువకులది సాధారణ మరణమేనని వరంగల్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నర్సింహులపేట ఎస్సై మాలోత్ సురేష్ సోమవారం వివరాలు వెల్లడించారు. రామన్నగూడెం గ్రామంలో ఈ ఏడాది జూన్ 10న స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న బొల్లోజు శ్రావణ్, ఎస్‌కె రహీమ్, ఉపేంద్రాచారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారికి మెరుగైన వైద్యం అందించినా బొల్లోజు శ్రావణ్, ఎస్‌కే రహీమ్ మృతి చెందడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తింది. వీరి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీ వారు ఇచ్చిన నివేదిక ప్రకారం యువకుల శరీరంలో ఎలాంటి విషపూరిత ఆహారం కలవలేదని, ఆ యువకులు సహజంగానే మృతి చెందినట్లు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై సురేష్ తెలిపారు. అయితే యువకుల మృతిపై రామన్నగూడెం వాసుల అనుమానాలకు ఈ ల్యాబ్ ఇచ్చిన నివేదికతో తెరపడింది.





# రక్తదానం.. ప్రాణదానం

- ఆపన్నహస్తం అందిస్తున్న రెడ్‌క్రాస్
- రోగులను ఆదుకుంటున్న ఎంజీఎం బ్లడ్ బ్యాంక్
- ఎందరికో జీవం పోస్తున్న దాతలు

**నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం**




వరంగల్ మెడికల్, సెప్టెంబరు 30 : రక్తదానం అంటే ప్రాణదానం.. అవసరమైన వ్యక్తికి రక్తాన్ని దానం చేయడం మానవుడి నైతిక విలువల్లో ఒకటి. ప్రపంచంలో ప్రతీ 2 సెకన్లకు ఎవరో ఒకరు రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. పూర్తి ఆరోగ్యంతో ఉన్నవారి రక్తం ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగపడుతుంది. స్వచ్ఛందంగా రక్త దానం చేయడానికి ఎందరో ముందుకు వస్తున్నారు. కొందరు 50 సార్ల కన్నా ఎక్కువగా రక్తదాన చేసినవారున్నారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని, పైగా వారు మరింత ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్లు చెబుతున్నారు. స్వచ్ఛంద రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, రక్తదాతలను ప్రోత్సహించడానికి ప్రతీ సంవత్సరం అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఎక్కువ సార్లు రక్తదానం చేసి ఎందరో ప్రాణాలు కాపాడిన వారు చాలామందే ఉన్నారు. అయితే రక్తదానం చేయడం మంచిది కాదని ఎంతోమంది అపోహపడుతుంటారు. కానీ రక్తదానం వల్ల క్యాన్సర్ రిస్క్‌ను తగ్గించుకోవచ్చని, గుండె సంబంధ వ్యాధులు దరిచేరవని, రక్తపోటు నియంత్రణకు సహాయపడుతుందని, ఏడాదికి రెండు, మూడు సార్లు రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కొవ్వును తగ్గించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే రక్తదానం చేసేవారు వైద్యుల సూచనలు, కొన్ని పరీక్షల తర్వాత చేయాల్సి ఉంటుంది.

**రోగుల సేవలో ఎంజీఎం బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్**

వరంగల్ ఎంజీఎంలోని బ్లడ్ బ్యాంక్ అవసరమైనంత రక్తాన్ని రోగులకు సమకూర్చడం ద్వారా విశేషమైన సేవలందిస్తోంది. పూర్తిగా రక్తం కావాల్సినవారికి రక్తం, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, ఎర్రరక్త కణాలు మాత్రమే అవసరమైనవారికి రక్తం నుంచి వేరు చేసి అందజేస్తోంది. తలసేమియా, రక్తహీనత, క్యాన్సర్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తాన్ని ఉచితంగా ఇస్తోంది. ఏటా 11వేల యూనిట్ల రక్తాన్ని రోగులకు సమకూరుస్తున్న ఈ బ్లడ్ బ్యాంక్ ఆ మేరకు అనవరమైన రక్తాన్ని సేకరించేందుకు ప్రతీ నెల నాలుగు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఉచితంగా, ప్రైవేటు ఆసుపత్రుల రోగులకు మాత్రం యూనిట్ రూ.1050 చొప్పున అందజేస్తోంది. ప్రతి రక్తదానం చేస్తే వారికి కావాల్సిన గ్రూప్ రక్తాన్ని రూ.800 ఇస్తోంది. అలాగే హనుమకొండ సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్ఎస్) కూడా రక్త సేకరణ, సరఫరాలో ప్రముఖపాత్ర పోషిస్తోంది. తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తాన్ని అందిస్తోంది. రక్తాన్ని నిల్వ చేయడానికి, రక్తం నుంచి ప్లాస్మా, ప్లేట్‌లెట్, ఎర్ర రక్తకణాలను వేరు చేయడానికి అధునాతనమైన పరికరాలు ఇందులో ఉన్నాయి. ఏటా రక్తదాన శిబిరాలను నిర్వహించడమే కాకుండా రక్తదాతలను ప్రొత్సహిస్తోంది.

## ఆ సంఘటనే నన్ను రక్తదాతగా మార్చింది.. : భాస్కర్, రక్తదాత



వరంగల్ దేశాయిపేటకు చెందిన భాస్కర్ వృత్తి రీత్యా ప్రైవేటు ఉపాధ్యాయుడు. 2007లో తన సోదరుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో శస్త్రచికిత్సకు రక్తం అవసరమై రెండ్రోజుల పాటు అనేక మందిని సంప్రదించారు. కానీ రక్తం దొరక్కపోవడంతో చివరకు తాను రక్తం ఇవ్వడంతో ఆపరేషన్ జరిగి తన సోదరుడు కోలుకున్నాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 55 సార్లు రక్తదానం చేసిన భాస్కర్ ప్రతీ మనిషి రక్తదానం చేస్తే ఎందరో ప్రాణాలు నిలుస్తాయని, తన అన్న ఉదంతం తనను రక్తదాతగా మార్చిందని చెబుతున్నారు.

## 131 సార్లు రక్తదానం చేసిన రాజేశ్వర్‌రావు



వరంగల్‌లోని మట్టెవాడకు చెందిన తోట రాజేశ్వర్ రావు ఆర్య ఇప్పటి వరకు 131 సార్లు రక్తదానం చేశారు. రక్తదానం గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. తన 20వ ఏట నుంచి మొదలు పెట్టి ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తున్నారు. ఇప్పటి వరకు 131 సార్లు రక్తదానం చేసి రికార్డు నెలకొల్పారు. అంతేకాదు రక్తదానంపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆదుకుంటూ ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.



## 26 సార్లు రక్తదానం చేశా : మధు

పెరుమాండ్ల మధు వృత్తిరీత్యా జర్నలిస్టు. రక్తదానం సామాజిక బాధ్యతగా ఇప్పటి వరకు 26 సార్లు రక్తదానం చేశారు. మన ముచ్చట్లు అనే సంస్థ ద్వారా ఆయన పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆ సంస్థ ద్వారా పలుమార్లు రక్త దాన శిబిరాలు నిర్వహించారు. అందరూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

# చేయూతనిస్తే.. చేతికర్రతో ఏం పని?

- జీవిత చరమాంకంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధులు
- సంక్షేమ శాఖ అధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



**నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం**

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 29 : నవమాసాలు మోసి, కని ఒక బతుకునిస్తారు. ఆ పిల్లల బతుకులు చల్లగా ఉండాలని మనసారా కోరుకుంటారు. వారిని ప్రయోజకులను చేయడంలోనే అలసిపోయినా జీవిత పయనంలో తామూ సేద దీరాలని ఆశిస్తారు. బిడ్డల ప్రేమ లభిస్తే చాలు. తమను కంటికి రెప్పలా చూసుకుంటే చాలు తమకంతకన్నా ఏం కావాలి భగవంతుడా.. అని కలలు కంటారు. కానీ ఆ కలలు ఛిద్రమైతే.. బాధ్యత మరిచి బిడ్డలు తమను భారంగా భావిస్తే.. ఎలాగైనా వదిలించుకోవాలని చూస్తే ఆ తల్లిదండ్రుల మనసులు ముక్కలవుతాయి. అలా ప్రస్తుత సమాజంలో ఎంతో మంది వృద్ధులు దేవుడిపైనే భారం వేసుకుంటూ దిక్కులేని వారిగా మౌనంగా రోదిస్తూ రోడ్డున పడుతున్నారు. తమ కనుపాపల ఆలనాపాలనాకు నోచుకోక.. ఉప్పెనలా వచ్చే కన్నీటి సునామీని దిగమింగుతూ.. బాధను బయటి వారికి చెప్పి తమ కన్నవారిని తక్కువచేయలేక చేయూతనిచ్చే వారు లేక.. చేతికర్రే ఆసరగా.. ఆశ్రమాలే ఆశ్రయంగా.. దుఃఖ దినాలను గడుపుతున్నారు. అలాంటి వారి నిస్సహాయస్థితిని ప్రపంచానికి చూపుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోని కన్నవారిని గుణపాఠాలు చెప్పేలా 'ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని' జరుపుతున్నారు. వయోజనుల హక్కుల ఉల్లంఘన, వారిని మానసికంగా, శారీరకంగా వేధించే చర్యలు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న క్రమంలో 2002లో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యుహెచ్‌వో) ప్రపంచాన్ని ఈ అంశంపై మేల్కొలిపే చర్యలను చేపట్టింది. ప్రపంచంలోని వివిధ ప్రభుత్వ సంస్థలు, మేధావి, సామాజిక వర్గాలు వయో వృద్ధుల సమస్యలపై గళమెత్తాయి. ఈ క్రమంలోనే అక్టోబరు 1వ తేదీన ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

## ముందస్తుగా వారోత్సవ కార్యక్రమాలు

జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు వారోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 25న ప్రారంభమైనా ఈ కార్యక్రమాల్లో వృద్ధుల హక్కులు, చట్టాలు, బిడ్డల పోషణ బాధ్యత తదితర అంశాలపై ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు.

**చేయూత లేక.. ఆశ్రయం దొరక్క..**

జీవితమంతా కడుపునపుట్టిన పిల్లల బాగోగులు, వారి ఉన్నతి కోసం శ్రమించిన తల్లిదండ్రులకు ప్రస్తుతం వృద్ధాప్యం ఓ భారంగా మారుతోంది. గుండెల్లపై ఆడుకున్న బిడ్డలే.. పెద్దయ్యాక గుండెలపై తన్నుతుంటే భరించలేక మరింత కుంగిపోతున్నారు. సూటిపోటి మాటలు.. వేధింపులు.. అగౌరవ పరిస్థితుల మధ్య జీవిత చరమాంకాన్ని నరకంగా భరించాల్సిన దుస్థితిలో ఉన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ పిల్లలు విదేశాలకు వెళుతుండటంతో ఎంతో మంది తల్లిదండ్రులు స్వగ్రామాల్లో ఒంటరి జీవితాలు గడుపుతున్నారు.

ఏడాదికో.. రెండేళ్లకో.. పండుగలు పబ్బాలకు వచ్చినా.. ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లో చేతిలో పట్టుకుని సెల్‌ఫోన్లతోనే కాలక్షేపం చేస్తున్నారు తప్ప తల్లిదండ్రుల బాగోగుల గురించి పట్టించుకోని వారెందరో ఉన్నారు. ఇక కొందరైతే ఏళ్లతరబడి విదేశాల్లోనే ఉంటూ ఆన్‌లైన్ పలకరిస్తున్నారు. మరి కొందరు వృద్ధుల జీవితమైతే దారుణం. బిడ్డలు తరిమివేయడం, కోడళ్లు, కుటుంబ సభ్యులు ఈసడించుకోవడం లాంటి పరిణామాలతో తల్లడిల్లుతున్నారు. చిన్నతనంలో బిడ్డల కంట నీరొస్తే తట్టుకోలేకపోయిన ఆ తల్లిదండ్రులకు.. ఆ బిడ్డలే పెద్దయ్యాక కన్నవారిని వృద్ధాశ్రమాల్లో నిస్సిగ్గుగా, నిర్దయగా చేర్పి చేతులు దులుపేసుకుంటున్నారు. ఇలా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విస్మరించినా, వారికి ఆర్థిక బాధలు కలగజేసినా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సిందే. తల్లిదండ్రులు తమ బిడ్డల నిరాధరణపై ఆర్‌డీవోకు విజ్ఞాపన చేస్తే చట్టరీత్యా విచారణ జరిపి ఆ తదుపరి చర్యలను ఎదుర్కోవాల్సిందే. బిడ్డలు ఉద్యోగులైతే వారి వేతనాల నుంచే కోత విధించే అవకాశాలున్నాయి.

**చట్టరీత్యా చర్యలు ఎదుర్కోవాల్సిందే..**

వృద్ధుల ఆలనాపాలనా విషయంలో బిడ్డలు ఏమాత్రం ఇబ్బందులు పెట్టినా చట్టరీత్యా తీసుకునే చర్యలను ఎదుర్కోవాల్సిందే. ముఖ్యంగా వారికి సరైన వైద్యం ఇప్పించడంలో నిర్లక్ష్యం చేయడం, దురేద్దశపూర్వకంగా వారికి అధిక మోతాదులో మందుల ఇవ్వడం, ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పెట్టడం, కనీస వసతుల కల్పనను విస్మరించడం లాంటి ఎన్నో అంశాలు వయోజన వేధింపుల పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సమస్యలపై వృద్ధులు ఫిర్యాదు చేస్తే చట్టపరంగా శిక్ష తప్పదు. 1973 సెక్షన్ 125 ప్రకారం తమను తాము పోషించుకోలేని పరిస్థితిలో ఉన్న తల్లిదండ్రులకు వారి పోషణకయ్యే ఖర్చులను పిల్లలే భరించాలి. అలాగే సెక్షన్ 24ప్రకారం ఏదైనా దురుద్దేశంతో వృద్ధుల సంరక్షణ బాధ్యతలను వదిలేస్తే జైలు శిక్ష, జరిమానా కూడా ఉంటుంది.

**ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబరు 14567**

పిల్లల నిరాదరణకు గురైన తల్లిదండ్రులు న్యాయపరంగా పోరాడేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా సంక్షేమ అధికారిని సంప్రదించాల్సి ఉంటుంది. తమకు జరిగే అన్యాయంపై 14567 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చు. దాంతో ప్రత్యేక విభాగం అధికారులు విచారణ జరిపించి వృద్ధులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారు.

## యువకుడి ఆత్మహత్య


సందీప్ (ఫైల్)

తాడ్వాయి, సెప్టెంబరు 30: మండలంలోని బీరెల్లి గ్రామానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంతెన సందీప్(26) కొన్నిరోజుల క్రితం జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నాడు. ఈక్రమంలో సోమవారం మధ్యాహ్నం అద్దెకు తీసుకున్న ఇంట్లో ఎవరూలేని సమయంలో సందీప్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసు కోవ డానికి కారణాలు తెలియరాలేదు. ఈవిషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## పురుగులమందు తాగి..


శ్రీరాం రవి (ఫైల్)

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 30: మద్యం మత్తులో పురు గులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘ టన మండలంలోని రంగాపురం గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామం లోని శ్రీరాం రవి(56) తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేస్తుండేవాడు. కొంతకాలం నుంచి మద్యా నికి బానిసై ఇంట్లోని కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టేవాడు. మద్యం సేవించొద్దని కుటుంబ సభ్యులు పలుమార్లు మంద లించినా పట్టించుకోలేదు. ఈనెల 29న మద్యం సేవించిన రవి మత్తులో ఇంట్లో పురుగులమందు తాగాడు. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమ వారం మృతిచెందాడు. మృతుడికి భార్య కోమల, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ప్రణీత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపు తున్నట్లు ఎస్సై వివరించారు.

## సరస్వతీ బ్యారేజీలో ఇసుక మేటల తొలగింపు

మహదేవపూర్, సెప్టెంబరు 30 : కాళేశ్వరం ప్రాజెక్టులోని సరస్వతీ బ్యారేజీలో ఇసుక మేటల తొలగింపు పూర్తయింది. బ్యారేజీ ఎగువ దిగువ ప్రాంతాల్లో భారీగా ఇసుక మేటలు వేయగా ఫ్లసింగ్ ప్రక్రియ ద్వారా తొలగించారు. బ్యారేజీలో మూడు రోజులపాటు ఇది కొనసాగిందని బ్యారేజీ ఈఈ యాదగిరి సోమవారం తెలిపారు.

## డిజిటల్ క్రాప్ సర్వేకు సహాయకులను నియమించండి

### కలెక్టర్‌ను కోరిన ఏఈవోలు


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఈవోలు

ములుగు, సెప్టెంబరు 30: డిజిటల్ క్రాప్ సర్వే చేయడానికి తమకు సహాయకులను నియమించాలని కోరుతూ జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు సోమవారం జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అమలుచేస్తున్న వివిధ పథకాలలో 49రకాల పనులు చేస్తున్న తాము తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. వేలాది ఎకరాలున్న క్లస్టర్‌ను ఒకే ఏఈవోకు బాధ్యతలు అప్పగించడంతో పూర్తిస్థాయిలో సర్వే చేయలేకపోతున్నామని, పని ఒత్తిడిలో జరిగిన పొరపాట్లతో రైతులు, ప్రజాప్రతినిధుల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. పక్క రాష్ట్రాలలో మాదిరిగా ఎక్కువ మంది ఏఈవోలు, సహాయకులను నియమించడంతోపాటు రైతులను భాగస్వాములను చేయాలని కోరారు.

## స్వల్పంగా పెరిగిన గోదావరి

కన్నాయిగూడెం, సెప్టెంబరు 30: మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరిలోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. నది సోమవారం స్వల్పంగా పెరిగి ప్రవహిస్తూ ఉంది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీళ్ల వదులుతుండటంతో పాటు ఎగువన కురిసిన వర్షాలకు ఇంద్రావతి, ప్రాణహిత నదుల వరద వచ్చి కలిసి ప్రవహిస్తుంటడంతో గోదావరికి వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ఎగువ నుంచి 3,13,240 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలోని మొత్తం 59 గేట్లు ఎత్తి 3,12,365 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇదిలా ఉండగా గుట్టల గంగారం వద్ద ఉన్న చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్ కొనసాగుతోంది. ఆదివారం వరకు ఫేజ్-3 నుంచి రెండు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేశారు. అధికారులు సోమవారం ఫేజ్ -3లో మరో మోటారు ఆన్ చేశారు. మొత్తం మూడు మోటార్ల ద్వారా 875 క్యూసెక్కుల నీటిని భీంఘనపూర్ రిర్వాయర్‌కు నీటిని ఎత్తి పోస్తున్నారు. బ్యారేజీ వద్ద 77.40 మీటర్లు, దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 77.90 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

## సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి : చైర్మన్

కాటారం, సెప్టెంబరు 30:ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం అభివృద్ధికి అధికారులు, రైతులు సమష్టిగా కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ తోటపెల్లి ప్రశాంత్ కోరారు. సోమవారం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రూ.2లక్షల మేర రుణమాఫీ చేయడం సంతోషకరమని, రూ.2లక్షలకు పైగా ఉన్న రైతులకు సైతం ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షలు మాఫీ చేయాలని చైర్మన్ ప్రశాంత్, రైతులతో కలిసి ప్రత్యేక తీర్మానం చేశారు. చింతకాని రోడ్డులో ఉన్న స్థలంలో ఫంక్షన్‌హాల్ నిర్మాణం, కాటారంలో పీపీసీ ఏర్పాటు, మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలకు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ మాట్లాడుతూ దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, ధాన్యం సేకరణతో సంఘం గత ఎనిమిదేళ్లుగా లాభాల బాటలో ఉందన్నారు. సంఘం అర్ధ వార్షిక నివేదికను సీఈవో ఎడ్ల సతీష్ చదివి వినిపించారు. సంఘం 3579 మంది సభ్యులు, సుమారు రూ.80 కోట్ల టర్నోవర్, రూ.13కోట్లకు పైగా రుణాలతో ప్రగతి బాటన ఉందన్నారు. సంఘం రూ.7.50 కోట్ల లాభాలతో అభివృద్ధి దిశగా సాగుతున్నదన్నారు. లావణీ పట్టాల భూములకు కూడా రుణాలు అందించాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రుణాలివ్వాలన్నారు. జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, డైరెక్టర్లు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, చీమల సత్యం, జక్కుల అజయ్, ఐలి రాజబాపు, బాసాని హిమాకర్, బండి రమేష్, దండ్రు రాజయ్య, ఐత కృష్ణవేణి, మారపాక రాజేశ్వరి, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు రమేష్‌రెడ్డి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రావెల్స్ బస్సు బోల్తా : 21 మందికి గాయాలు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

జనగామ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళ్తున్న ట్రావెల్స్ బస్సు బోల్తా కొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలు కాగా 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా జనగామ మండలం యశ్వంతాపూర్ వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, బస్ డ్రైవర్, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ కంపెనీకి చెందిన బస్సు ఆదివారం రాత్రి ప్రయాణికులతో బెంగుళూరు నుంచి వరంగల్‌కు బయలుదేరింది. ఆదివారం రాత్రి బయలుదేరిన బస్సు సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు చేరుకుంది. అక్కడ కొంతమంది ప్రయాణికులను ఎక్కించుకొని వరంగల్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో ఉదయం 10 గంటలకు యశ్వంతాపూర్‌లోని ఉన్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం దాటగానే బస్సు కుడి వైపు ముందు టైర్ పేలిపోయింది. దీంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టుకుంటూ 50 మీటర్లు వెళ్లి బోల్తా కొట్టింది. టైర్ పేలడంతో అప్రమత్తమైన డ్రైవర్ బ్రేకులు వేయడానికి ప్రయత్నించినా బస్సు అదుపులోకి రాలేదు. ఇదే క్రమంలో వాలుగా ఉన్న డివైడర్ మీదకు దూసుకెళ్లిన బస్సు బోల్తా పడింది. ఈ సమయంలో బస్సులో 21 మంది ప్రయాణికులు ఉన్నారు. ఊహించని పరిణామంతో ప్రయాణికులు అంతా ఉలిక్కి పడ్డారు. బస్సు బోల్తా పడగానే బస్సు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ధ్వంసమైన అద్దాల నుంచి కొంతమంది ప్రయాణికులు బయటకు వచ్చారు. కాగా.. లోపల చిక్కుకున్న ప్రయాణికులను స్థానికులు బయటకు తీసుకువచ్చారు. కాగా.. ఈ ప్రమాదంలో బెంగుళూరు నుంచి వరంగల్‌కు వస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా గడ్డిగానిపల్లికి చెందిన బెద్దెల పోచయ్య బస్సులో చిక్కుకొని పోయాడు. ప్రమాద సమయంలో అతడి ఎడమ చేయి కిటికీ ద్వారా బయటకు వచ్చి బస్సు కింద ఇరుక్కుపోయి నుజ్జునుజ్జు అయింది. దీంతో అతన్ని బయటకు తీయడం కష్టంగా మారింది. కాగా.. ఘటనపై సమాచారం అందుకున్న డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారథి, జనగామ, రఘునాథపల్లి సీఐలు దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసు సిబ్బంది, స్థానికులు, జేసీబీల సాయంతో బస్సులో చిక్కుకున్న పోచయ్యను అతికష్టం మీద బయటకు తీసుకువచ్చి జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

## బొగ్గు ఉత్పత్తి అంతంతమాత్రమే!

### సెప్టెంబరు నాటికి సాధించింది 58 శాతమే..

కాకతీయఖని, సెప్టెంబరు 30: బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి భూపాలపల్లి ఏరియా పుంచుకోలేకపోతోంది. యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. సెప్టెంబరు నాటికి 58 శాతం అంటే.. 12,65577 టన్నుల బొగ్గు ఉత్పత్తిని మాత్రమే సాధించింది. 2024-25 వార్షిక సంవత్సరం యాజమాన్యం 49.60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని ఏరియాకు నిర్దేశించింది. దీంతో అధికారులు గడిచిన ఆరు నెలల్లో 12.65లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించారు. అయితే నెలలు గడిచే కొద్దీ టార్గెట్ పెరుగుతూ తగ్గుతూ వస్తోంది. ఏప్రిల్‌లో 75 శాతం, మేలో 72 శాతం, జూన్‌లో 65 శాతం, జూలైలో 63 శాతం, ఆగస్టులో 67 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించారు. సెప్టెంబరు 29 నాటికి 58 శాతం మాత్రమే సాధించారు. కేటీకే-1 గని 74 శాతం, కేటీకే-5 గని 86, కేటీకే-6 గని 70 శాతం, కేటీకే-8 గని 74 శాతం, ఓసీ-2 గని 58 శాతం, ఓసీ-3 గని 50 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించింది.

## సొంత ఖర్చుతో రోడ్లకు మరమ్మతులు

కాటారం, సెప్టెంబరు 30: మండల కేంద్రమైన కాటారం జీపీ పరిధిలో మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్ సొంత ఖర్చులతో సోమవారం రోడ్లకు మరమ్మతులు చేయించారు. మిషన్ భగీరథ పనుల సమయంలో రోడ్లను తవ్వి పైప్‌లైన్లు వేసిన కాంట్రాక్టర్లు, అధికారులు వాటిని పూడ్చివేయకపోవడంతో గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించిన శ్రీనివాస్ కంకర, ఇసుక, సిమెంట్ తెప్పించి కూలీలతో కలిసి గుంతలను పూడ్చివేయించి రోడ్లకు మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా పలువురు శ్రీనివాస్‌ను అభినందించారు.

## ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

### భూపాలపల్ల ఎస్పీ ఖరే


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 30: వివిధ సమస్యల నిమిత్తం ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీస్ అధికారులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాదివస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ ఏదేని ఫిర్యాదు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు భరోసా ఇవ్వాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తంగా 16 మంది ఫిర్యాదులు అందించారు.

## సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

### గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు30: గిరిజనులు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పాల్గొని గిరిజనుల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 30 మంది తమ సమస్యల పరిష్కారం కోసం పీవోకు వినతులు అందించారు. గిరివికాసం పథకం ద్వారా పొలంలో విద్యుత్తు సౌకర్యం కల్పించాలని తాడ్వాయి మండలానికి చెందిన ఆలెం నవీన్ వినతి పత్రం అందించారు. తండ్రి పేరు మీద ఉన్న ఆర్వోఎఫ్ఆర్ పట్టా కల్గిన భూమి తన పేరు మీదుగా మార్చాలని మంగపేట మండలం మల్లూరు గ్రామానికి చెందిన కోరం సంధ్యారాణి విన్నవించారు. అదే మండలం వీరాపూర్‌కు చెందిన వారు తమ గ్రామంలోని చెరువునకు మరమ్మతు పనులు చేయిం చాలని వేడుకున్నారు. గత కొన్నేళ్లుగా సాగుచేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు కల్పించాలని ఏటూరునాగారం మండలానికి చెందిన గండెపెల్లి నర్సయ్య వినతి పత్రం అందించారు.ఐటీడీఏ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగ అవకాశం కల్పించాలని గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన జయప్రకాష్ కోరారు.

కన్నాయిగూడెం మండలం సర్వాయి గ్రామంలో ఇటీవల స్తంభాలు విరిగి విద్యుత్తు సరాఫరా నిలిచిపోయిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని తుడుందెబ్బ నాయకుడు పోడెం శోభన్ వినతి పత్రం అందించారు. సీఆర్టీగా మహబూబాబాద్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నానని, అక్కడి నుంచి ములుగు జిల్లాకు బదిలీ చేయాలని పోరిక విజయ పీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో భీమ్‌రావు, ఎస్‌వో రాజ్‌కుమార్, ఎస్‌డీసీ జగన్‌మోహన్‌రెడ్డి, డీటీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీలో మూడు కేటగిరీల్లో ప్రతిభ



చిట్యాల, సెప్టెంబరు 30: తెలంగాణ డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన మామిడి మహేష్ మూడు కేటగిరీల్లో ఉత్తమ ఫలితాలు సాధించాడు. లాంగ్వేజ్ తెలుగు విభాగంలో 80.90 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలవగా, స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో 75.40 మార్కులతో జిల్లా మూడో ర్యాంక్ సాధించాడు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 73.40 మార్కులతో జిల్లా ఐదో ర్యాంక్ సాధించాడు. మహేష్ ప్రస్తుతం మొగుళ్లపల్లి ఎంజేపీలో పీజీటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

## డీఎస్సీ ఫలితాల్లో మెరిసిన యువకుడు



వాజేడు, సెప్టెంబరు 30: డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని పేరూరుకు చెందిన యువకుడు శ్రీరామ సుమన్ ప్రతిభ చాటాడు. ఫిజికల్ సైన్స్ విభాగంలో 76.77 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. అదే విధంగా మ్యాథ్స్ కేటగిరీలో సైతం నాలుగో ర్యాంకు సాధించాడు. పేరూరుకు చెందిన నారాయణ, విజయలక్ష్మి దంపతుల కుమారుడు సుమన్ చిన్నప్పటి నుంచి చదువులో మేటి. నాయూబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన సుమన్ ఉపాధ్యాయ వృత్తి అంటే తనకేంతో మక్కువ అని తెలిపాడు.

## రేగొండ వాసికి 28వ ర్యాంకు



రేగొండ, సెప్టెంబరు 30: భూపాపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన సోమ సౌమ్యశ్రీకి డీఎస్సీలో ప్రతిభను చాటింది. ఖమ్మం జిల్లా స్థాయిలో ఎస్‌జీటీ కేటగిరీలో 28వ ర్యాంకు సాధించింది. సౌమ్యశ్రీకి వివాహం కాగా ఇంటి వద్దనే ఉంటూ ఖమ్మంలో పరీక్ష రాసింది.

## స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్మైల్ ఫౌండేషన్ సభ్యులు

భూపాలపల్లి టౌన్, సెప్టెంబరు 30: స్మైల్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం సోమవారం పట్టణంలో జరిగింది. ముఖ్య అతిథిగా డీఈవో రాజేందర్ హాజరయ్యారు. జిల్లాలోని 18 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు స్మైల్ ఫౌండేషన్ మేనేజర్ కిషోర్, తెలంగాణ కో-ఆర్డినేటర్ అజీజోద్దీన్ అవగాహన కల్పించారు. 6,7 తరగతుల పిల్లలకు ఉజ్వల భవిష్యత్ కోసం ఈ శిక్షణ దోహద పడుతుందని డీఈవో తెలిపారు. ఏఎంవో లక్ష్మణ్, సీఎంవో రమేష్, డీఎస్‌వో స్వామి, ఏసీజీఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 30: డీఎస్సీ ఫలితాల్లో అర్హత సాధించిన జిల్లాలోని అభ్యర్థులకు అక్టోబరు 1నుంచి సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని డీఈవో పాణిని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సమయంలో నమోదు చేసుకున్న మొబైల్‌కు కానీ, మెయిల్ అడ్రస్‌కు కానీ మెసేజ్ వస్తుందని, దీంతో వారు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పూర్తి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

## తిమ్మన్నకుంట స్థలాన్ని సర్వే చేసిన అధికారులు

### పురుగు మందు డబ్బాలతో అడ్డగించిన మహిళలు

కాటారం, సెప్టెంబరు 30: మండల కేంద్రం కాటారం రెవెన్యూ శివారు సర్వే నంబరు 49లో గల తిమ్మన్నకుంట స్థలాన్ని సోమవారం ఐబీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి పూర్తి స్థాయిలో హద్దులు వేయడానికి చర్యలు చేపట్టారు. ఐబీ డీఈఈ సతీష్, ఏఈ రాజేష్, ఆర్ఐ వెంకన్న, సర్వేయర్ వినయ్ సిబ్బందితో కలిసి యంత్రాల సాయంతో ఆయకట్టు లేని తిమ్మన్నకుంట విస్తీర్ణం 5ఎకరాల 26గుంటలకు హద్దులు వేయడానికి సర్వే చేశారు. పలువురు మహిళలు తమ భూములు ఉన్నాయని, ఎలా సర్వే చేస్తారంటూ పురుగుల మందు డబ్బాలతో అధికారుల సర్వేను అడ్డుకున్నారు. సంఘటన స్థలా నికి వచ్చిన సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ అధికారులతో మాట్లాడి ఎంత భూమి అక్రమణ లకు గురైందో తెలుసుకున్నారు. మంగళవారం పోలీస్‌అధికారులతో మాట్లాడి పోలీస్ ప్రొటెక్షన్‌తో సర్వే పూర్తి చేసి శాశ్వత హద్దు రాళ్ల వేయాలన్నారు. త్వరలో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సిబ్బంది శేఖర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

మహాముత్తారం, సెప్టెంబరు 30: మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఈవో మార్క శ్రీధర్ మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో పీఏసీఎస్ ద్వారా రైతులకు అందించిన ఎరువులు, రుణాలపై సభ్యులకు, రైతులకు వివరించారు. చైర్మన్ సోమ శాంతకుమార్ మాట్లాడుతూ లావణి పట్టాలు ఉన్న చాలా మంది రైతులు ఇప్పటికే తమ సంఘంలో రుణాలు తీసుకొన్నారని, వారికి ఇప్పుడు రుణమాఫీ వర్తించిందని అన్నారు. సంఘం ద్వారా ఆ రైతులకు తిరిగి రుణం ఇవ్వమని చెప్పడం సరికాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకొని లావణి పట్టాలు ఉన్న రైతుల రుణాలను రెన్యూవల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీవో సూపరింటెండెంట్ రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డి, సభ్యులు చిన్న రాజయ్య, వెంకట్‌రెడ్డి, సుజాత, భాస్కర్‌రెడ్డి, సమ్మక్క, కంపె రాజయ్య, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

### ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 30: ప్రజావాణి వినతులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టి.ఎస్.దివాకర ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రజల నుంచి 51 వినతులు రాగా వాటిని కలెక్టర్ స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, డీసీవో సర్దార్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఈవో పాణిని, సీపీవో ప్రకాష్, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు కృషిచేయాలి : ఎస్పీ శబరీశ్

ములుగు, సెప్టెంబరు 30: జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ శబరీశ్ అన్నారు.జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం సోమవారం జరిగింది. ఎస్పీ మాట్లాడుతూ దొంగతనాలు, ఆర్థిక నేరాలలో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా ముమ్మర దర్యాప్తు చేయాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీని పెంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 370 సీసీ కెమెరాలను అమర్చి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నేర పరిశోధనలో సీసీ కెమెరాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. ప్రజావాణి, గ్రామసభలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. మాదకద్రవ్యాలను విక్రయించే వారిపై హిస్టరీ షీట్లు నమోదుచేసి నార్కోటిక్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. ఈ సమీక్షలో ఓఎస్డీ మహేష్ బాబాసాహెబ్ గీతే, అదనపు ఎస్పీ సదానందం, ములుగు డీఎస్పీ రవీందర్, డీసీఆర్‌బీ డీఎస్పీ రాములు, సీఐలు శంకర్, శ్రీనివాస్, కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సతీష్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజుద్దీన్, టీవీ.సూరి, హరీష్, కృష్ణప్రసాద్, తిరుపతి, వెంకటేశ్, డీసీఆర్‌బీ ఎస్సై జగదీశ్ పాల్గొన్నారు.

## టీచర్ల ఓట్లు నమోదు ప్రక్రియ ప్రారంభం

గణపురం, సెప్టెంబరు 30: వరంగల్- నల్లగొండ, ఖమ్మం టీచర్ల ఎమ్మెల్సీ కాలపరిమితి మార్చి 29తో ముగియనున్న నేపథ్యంలో ఓట్లు నమోదు ప్రక్రియ చేపట్టినట్లు తహసీల్దార్ సత్యనారాయణస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్30న ప్రారంభం కాగా అక్టోబర్ 6 వరకు ఓటర్ల నమోదుకు చివరి తేదీ అని పేర్కొన్నారు. నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితా, డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని తెలిపారు. తుది జాబితా డిసెంబర్ 30న ప్రకటించనున్నట్టు పేర్కొన్నారు.

## గౌడ సంఘం కార్యవర్గం ఎన్నిక

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 30: మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామంలో గౌడసంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెరుగు భిక్షపతిగౌడ్, ఉపాధ్యక్షుడిగా గడ్డం రకోధర్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రమేష్, కోశాధికారిగా మెరుగు తిరుపతి ఎన్నికయ్యారు.

## రామచంద్రాపురం భూ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ : అదనపు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 30: ములుగు మండలంలోని రామచంద్రాపురం గ్రామ భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో తహసీల్దార్ విజయభాస్కర్‌తో కలిసి గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని భూ సమస్యల గుర్తింపు విషయంలో గతంలో దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. దాదాపు 500కుపైగా దరఖాస్తులను కంప్యూటరీకరణ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని రైతుల నుంచి భూసమస్యలకు సంబంధించి ప్రత్యేక బృందాల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఈ బృందాలు అక్టోబరు 1 నుంచి 3 వరకు గ్రామంలో పర్యటించి నివేదిక అందిస్తారని అన్నారు.

## కమలాపురం మాజీ ఎంపీపీ మృతి


ఆగయ్య (ఫైల్)

మంగపేట, సెప్టెంబరు 30: మండలంలోని కమలాపురం మాజీ ఎంపీపీ కల్యాణపు ఆగయ్య (68) సోమవారం తెల్లవారజామున మృతి చెందారు. గుండెపోటుతో తన నివాసంలోనే తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆగయ్య ఇంటి వద్దే ఉంటున్నారు. ఒక్కసారిగా ఛాతీ నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందారు. సీపీఎం మండల నాయకుడైన ఆయన కమలాపురం మాజీ ఇన్‌చార్జి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఎంపీపీగా కొనసాగారు. బిల్ట్ ఫ్యాక్టరీలో సీనియర్ కార్మికుడిగా పనిచేసిన ఆగయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య వనమాల, నలుగురు పిల్లలు ఉన్నారు.

## సుజాత సేవలు అభినందనీయం


సుజాతను సన్మానిస్తున్న అంగన్‌వాడీ బృందం

మేడారం, సెప్టెంబరు 30: అంగన్‌వాడీ టీచర్ సుజాత సేవలు అభినందనీయమని సెక్టార్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజ కొనియాడారు. తాడ్వాయి మండలంలోని నార్లాపూర్‌లో సోమవారం అంగన్‌వాడీ టీచర్ చల్లగొండ సుజాత పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1979లో ఉద్యోగంలో చేరి అటవీ ప్రాంతమైన పడిగాపూర్, నార్లాపూర్ గ్రామాల్లో జంపన్నవాగును దాటి వరదలు, వర్షాలను లెక్కచేయకుండా సుజాత ఉత్తమ సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది రేణుక, కృష్ణవేణి, కాంత, పద్మ, రాంబాయి, శ్రీదేవి, అనసూర్య, వాణమ్మ, అరుణ, సుజాత, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి : సీపీఎం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 30 : కేంద్రంలోని బీజేపీ మతోన్మాద, ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. పలిమెలలో సోమవారం ఏర్పాటు చేసిన సీపీఎం పార్టీ ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రజల్లో హింసను ప్రేరేపించే విధంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. ఈకార్యక్రమంలో సీపీఎంజిల్లా కార్యవర్గ సభ్యులు పోలం రాజేందర్, పార్టీ సభ్యులు పాగే పొట్టయ్య, శేఖర్, బాలక్క, మూసాకి బిలంద్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సమష్టి సహకారంతో సంఘం అభివృద్ధి

మల్హర్, సెప్టెంబరు 30 : ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం సభ్యుల, రైతుల సమిష్టి సహకారంతో సంఘాన్ని అభివృద్ధి చేసుకుందామని చైర్మన్ ఇప్ప మొండయ్య అన్నారు. తాడిచర్లలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆర్థిక స్థితిగతులు, అభివృద్ధి గురించి సీఈవో సంతోష్ చదివి వినిపించారు. గన్నీ సంచుల వ్యత్యాసం వల్ల సంఘానికి కమిషన్ రావడం లేదని సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సభ్యులు తెలపగా ఇప్పటికే పలుమార్లు జిల్లా అధికారులను కలిసి వివరించినట్లు చైర్మన్ మొండయ్య తెలిపారు. రైతులు కూడా గన్నీ సంచుల విషయంలో సహకరించాలని కోరారు. అలాగే పీఏసీఎస్ కార్యాలయంలో సౌకర్యాల దృష్ట్యా వసతుల ఏర్పాటుకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు చైర్మన్ తెలిపారు. రైతులు, సంఘ సభ్యుల సహకారంతో మరిన్ని వ్యాపారాలను సంఘం ఆధ్వర్యంలో చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సూర్య ప్రకాశ్‌రావు, డైరెక్టర్లు వొన్న తిరుపతిరావు, సురేష్, సర్వానాయక్, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.